క్లుప్తంగా

ముదిరాజ్ సంఘం కమిటీ



నూతన కమిటీ సభ్యులు

గన్నేరువరం: మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం భవనంలో ముదిరాజ్ సంఘం నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రంగనవేని లక్ష్మీనర్సు, ఉపాధ్యక్షుడిగా బోయిని మల్లయ్య, ప్రధాన కార్యదర్శి దామ రాజయ్య, కార్యవర్గ సభ్యులుగా బోయిని కుమార్, గరిగి రాయమల్లు, రంగనవేని తిరుపతి, బోయిని అంజయ్య, రంగనవేని లక్ష్మయ్య, వెంకటి, యాదగిరిని ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

గంగాధర: మండలంలోని కాసారం గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా న్యాతరి దిలీప్, ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్, కోశాధికారిగా రాజశేఖర్ ఎన్నికయ్యారు. సమావేశంలో సంఘం నాయకులు, సభ్యులు ద్యావ శ్రీనివాస్, న్యాతరి రవి, శివశంకర్, గంగరాజ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ క్లబ్ అధ్యక్షుడి ఎన్నిక

చొప్పదండి: మండంలోని గుమ్లాపూర్ న్యూ నవక్రాంతి యూత్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా కొలపురి వెంకటేశ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కోలపురి విజయ్, ప్రధాన కార్యదర్శిగా కోలపురి హనుమంతు, కోశాధికారిగా కోలపురి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా చిర్ర తిరుపతి, ఆర్గనైజర్‌గా రమేశ్ ఎన్నికయ్యారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక



సన్మానిస్తున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం

హుజూరాబాద్‌రూరల్ : మండలంలోని రాంపూర్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న భరత్ అనే విద్యార్థి ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సురేందర్, వ్యాయామ ఉపాధ్యాయుడు వేముల రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి జిల్లాలో జరిగే పోటీల్లో విద్యార్థి పాల్గొంటారని తెలిపారు. జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడాన్ని హర్షిస్తూ విద్యార్థిని, వ్యాయామ ఉపాధ్యాయుడిని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం శాలువాతో సత్కరించారు.

గిన్నీస్ బుక్‌ఆఫ్ వరల్డ్ రికార్డుకు..



అభినందిస్తున్న ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్

హుజూరాబాద్‌రూరల్ : మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలోని ఏకశిల సీబీఎస్ఈ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న కె.లాస్య అనే విద్యార్థిని హైదరాబాద్‌లోని గచ్చి బౌలి స్టేడియంలో కూచిపూడి నృత్య పోటీలలో పాల్గొని గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం సంపాదించుకున్నారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్ దినేష్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.కిరణ్మయి ప్రత్యేకంగా అభినందించారు.

బస్సును ఢీకొట్టిన కారు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామ శివారులోని ఎరుకులగూడెం క్రాస్‌రోడ్డు వద్ద ఆర్టీసీ బస్సును ఓ కారు వేగంగా వచ్చి ఢీకొట్టిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. వరంగల్-1 డిపోకు చెందిన బస్సు వరంగల్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తుండగా సింగాపూర్ గ్రామ శివారులోని ఎరుకులగూడెం వద్దకు చేరుకోగానే కరీంనగర్ నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ నాతి యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గుండె జబ్బుతో బాలుడి మృతి

హుజూరాబాద్‌రూరల్: అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు గుండె జబ్బుతో మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యాంతమయ్యారు. ఈ సంఘటన మండలంలోని జూపాక గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు...మామిడి పల్లవి కుమార్ దంపతుల కుమారుడు భరత్ చంద్ర(14) గత కొంతకాలంగా గుండె జబ్బుతో బాధపడుతున్నాడు. ఇటీవల హైదరాబాద్ యశోద హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయించారు. అయినప్పటికీ బాలుడి ఆరోగ్యం కుదుటపడక పోవడంతో గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్లు చెప్పారు. బాలుడి మృతితో ఆఇంటా విషాదం అలుముకుంది.

కల్వలకు మరమ్మతులెప్పుడో?

- ఇటీవల కురిసిన వర్షాలకు తెగిన కల్వల చెరువు
- చుక్క నీరు లేక ఏడారిగా మారిన వైనం
- తాత్కాలిక మరమ్మతు చేసిన గత ప్రభుత్వం
- మూడు మండలాలకు తాగు, సాగునీరు ప్రశ్నార్థకం
- మినీ ఎల్‌ఎండీగా మార్చాలంటున్న రైతులు



ఇటీవల కురిసిన వర్షాలకు తెగిన చెరువు(ఫైల్)

వీణవంక: ఆయకట్టు ప్రాంత ప్రజలకు వరప్రదాయనిగా మారిన కల్వల చెరువు చుక్క నీరు లేక ఏడారిగా మారింది. 53 ఏళ్లుగా తాగు, సాగు నీటికి ఉపయోపడుతున్న ఈ చెరువు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెగిపోయింది. దీంతో మూడు మండలాల ప్రజలకు తాగు, సాగు నీటికి కటకట తప్పేటట్లు లేదు. భారీ వర్షాలకు తెగిన కల్వల చెరువును మాజీ ఎంపీ వినోద్‌కుమార్, అప్పటి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ రసమయి బాలకిషన్, పాడి కౌశిక్‌రెడ్డి సందర్శించి తాత్కాలిక మరమ్మతు చేపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిస్తే కల్వల చెరువును మినీ ఎల్‌ఎండీగా మార్చాతామని ప్రకటించారు. దీని కోసం రూ.72 కోట్ల అంచనా వేశారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఓడిపోవడంతో ఇప్పుడు కల్వల చెరువు ప్రశ్నార్థకంగా మారింది. ఈ చెరువు పరిధిలో వీణవంక మండలంలో 8 గ్రామాలు, శంకరపట్నం మండలంలో 4 గ్రామాలు, జమ్మికుట మండలంలో 4 గ్రామాలకు తాగు, సాగు నీరు అందనుంది. అయితే చెరువు తెగిపోవడంతో నీటి ఎద్దడి ఏర్పడనుంది. ఈ చెరువు దిగువన ఆరు చెక్‌డ్యాంలు నిర్మించారు. రానున్న రోజుల్లో ఈ చెక్‌డ్యాంల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారనుంది. చెరువు పరిధిలో సుమారు 4వేల ఎకరాల ఆయకట్టు సాగు ఉండగా మరో 2వేల ఎకరాలకు మోటార్ల ద్వారా నీటి పారకం పారనుంది.

కల్వలకు 53 ఏళ్ల చరిత్ర..

శంకరపట్నం మండల పరిధిలో ఈ కల్వల చెరువు ఉంది. కానీ దిగువన మాత్రం వీణవంక, జమ్మికుంట మండలాల గ్రామాలకు పారకం పారుతుంది. 1973లో పీవీ నరసింహారావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కల్వల చెరువును సందర్శించినట్లు గ్రామస్తులు చెప్పుతున్నారు భారీ నీటిపారుదల శాఖ కిందనే ఉండటంతో మిషన్‌కాకతీయ పథకానికి ఎంపిక కాలేదు. దీంతో చెరువులో పూడిక, మట్టి పేరుకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. ఇదే గండి పడటానికి కారణంగా తెలుస్తోంది.

మినీ ఎల్‌ఎండీగా మార్చాలంటున్న రైతులు...

కల్వల చెరువును మినీ ఎల్‌ఎండీగా మార్చుతామని గతంలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ప్రకటించారు. అప్పటి సీఎం కేసీఆర్‌తో మాట్లాడి రూ.72 కోట్లతో రూపకల్పన చేశారు. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఓడిపోవడంతో మినీ ఎల్‌ఎండీ కలగానే మారింది. గండి తెగిన చోట తాత్కాలిక మరమ్మతులు చేయించారు. అయితే భారీ వరద వస్తే మళ్లీ తెగిపోయే ప్రమాదం ఉన్నందున వచ్చిన వరద వచ్చినట్టే తూము ద్వారా నీరు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. శంకరపట్నం మండలంలోని కన్నాపూర్, రాజాపూర్, కాచాపూర్ గ్రామాలతో పాటు వీణవంక మండలంలోని మల్లన్నపల్లి, రెడ్డిపల్లి, బ్రహ్మణపల్లి, వీణవంక, రామక్రిష్టాపూర్, లస్మక్కపల్లి, పోతిరెడ్డిపల్లి, జమ్మికుంట మండలం కాపులపల్లి, విలాసాగర్, వెంకటేశ్వర్లపల్లి, తనుగుల గ్రామాల వరకు పారకం పారనుంది. మినీ ఎల్‌ఎండీగా మార్చితే తాగు, సాగు నీటికి ఇబ్బందులు ఉండవని ప్రజలు కోరుతున్నారు.

ఎస్సారెస్పీ పైనే ఆధారం...

కల్వల చెరువు పరిధలోని గ్రామాలకు నీరు చేరాలంటే ఎస్సారెస్పీ పైనే రైతులు ఆధారపడ్డారు. శంకరపట్నం మండలం తాడికల్ వద్ద ఎస్సారెస్పీ గేట్లు ఎత్తితే దిగువన తాడికల్ చెరువు నుంచి కల్వల చెరువులోకి వరద వస్తుంది. ఇక్కడి నుంచి బ్రహ్మణపల్లి, వీణవంక, రామక్రిష్టాపూర్, లస్మక్కపల్లి, పోతిరెడ్డిపల్లి, విలాసాగర్ లోని చెక్ డ్యాంలకు నీరు చేరుతుంది. దీంతో యాసంగి సాగు నుంచి కొంత గట్టెక్కవచ్చునని రైతులు చెప్పుతున్నారు. వారబంధీ పద్ధతిలో నీటిని విడుదల చేస్తామని అధికారులు ప్రకటించడంతో రైతులు ఆశలు అవిరయ్యాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కలుగజేసుకొని కల్వల చెరువును మినీ ఎల్‌ఎండీగా మార్చాలని మూడు మండలాల ప్రజలు కోరుతున్నారు.

మినీ ఎల్‌ఎండీగా మార్చాలి



ఇటీవల వర్షాలకు చెరువుకు భారీ గండి పడింది. చెరువులో ఇప్పుడు చుక్క నీరు లేదు. ఈ చెరువును నమ్ముకునే ఉన్నాం. ఆయకట్టు సుమారు 4 వేల ఎకరాలకు పైగా ఉంటుంది. చెరువులో నీళ్లు ఉంటేనే బావుల్లో ఊట పెరుగుతుంది. నీళ్లు లేక కొంత మంది నాట్లు వేయలేదు. వేసిన నాట్లకు నీటి పారకం అందుత లేదు. గత ప్రభుత్వం మినీ ఎల్‌ఎండీగా మార్చేందుకు ప్రతిపాదనలు చేసింది. నూతన ప్రభుత్వం స్పందించి మినీ ఎల్‌ఎండీగా మార్చాలి. లేకుంటే తాగు, సాగు నీటికి ఇబ్బందైతంది.

– కలకొండ మధుకర్‌రెడ్డి, రైతు, మల్లన్నపల్లి

పారకం లేదు



కల్వల చెరువులో నీళ్లు ఉంటే మాకు ఢోకా ఉండకపోయేది. మొన్నటి వర్షాలకు చెరువు తెగిపోవడంతో నీటి ఎద్దడి ఏర్పడుతుంది. యాసంగి నాట్లు వేసి పది రోజులవుతుంది. బావుల్లో ఊట తగ్గడంతో పారకం పారుతలేదు. ఇంకో పది రోజులైతే పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉంది. ఇప్పుడు చెరువులో చుక్క నీరు లేదు. 10 ఏళ్ల నుంచి ఎప్పుడు ఇంత గోస చూడలేదు. చెరువు మా ప్రాంత ప్రజలకు జీవనాధారం. ఇప్పటికైన ప్రభుత్వం కలుగేసుకొని మినీ ఎల్‌ఎండీగా ఏర్పాటు చేయాలి. లేకుంటే మళ్లీ వర్షాలకు తెగిపోతుంది.

– అనిల్, రైతు, మల్లన్నపల్లి

ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష

హుజూరాబాద్‌రూరల్: గురుకుల పాఠశాల ఐదో తరగతిలో ప్రవేశాల కోసం ఫిబ్రవరి 11న ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు హుజూరాబాద్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎ. మంజుల శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీలో లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమాచారం కోసం1800 425 45678 నంబర్‌ను సంప్రదించాలన్నారు. అర్హులైన విద్యార్థులు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు మంత్రి పొన్నం పర్యటన



గాగిరెడ్డిపల్లిలో ప్రారంభానికి సిద్ధంగా జీపీ భవనం

చిగురుమామిడి: మండలంలో శనివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించనున్నారు. ఉదయం చిగురుమామిడిలోని సర్వాయిపాపన్నగౌడ్ విగ్రహానికి పూలామాల వేసి అక్కడి నుంచి ర్యాలీగా వచ్చి బస్టాండ్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం నిర్వహించే కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. మండలంలోని లంబాడిపల్లి, గాగిరెడ్డిపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన జీపీ భవనాలను మంత్రి ప్రారంభిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి తెలిపారు.

ఇస్తామాకు తరలిరావాలి

హుజూరాబాద్‌రూరల్: వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలో ఈ నెల 6, 7వ తేదీల్లో జరిగే ముస్లిం ఇస్తామాకు తరలి రావాలని ఉమ్మడి జిల్లాల మజీద్ అండ్ ఈద్గా కబ్రస్తాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుల అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ కోరారు. శుక్రవారం మసీద్ ఆవరణలో మాట్లాడారు. ఇస్తామాకు అన్ని రకాల సదుపాయాలను కల్పించామని, ముస్లింలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తుల స్వీకరణను పరిశీలించిన కలెక్టర్



చొప్పదండి: దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్



గంగాధర: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి



తిమ్మాపూర్: స్వాగతం పలుకుతున్న నాయకులు

చొప్పదండి: ప్రజాపాలనలో భాగంగా ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు చివరిరోజు శనివారం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. పట్టణంలోని 14వ వార్డులో శుక్రవారం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ ద్వారా ఇప్పటి వరకు అందిన దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ, తహసీల్దార్ నరేందర్, మేనేజర్ ప్రశాంత్‌కుమార్, కౌన్సిలర్ జ్యోతి, అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

నిజమైన పాలనకు శ్రీకారం

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టి నిజమైన పాలనకు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండలంలోని సర్వారెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పదేండ్ల నిరంకుశ పాలనకు ప్రజలు చరమగీతం పాడారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని, ఇప్పటికే రెండు పథకాలు అమలు చేశామని వివరించారు. త్వరలోనే మహిళలకు రూ.2500 పంపిణీ, 200 లోపు యూనిట్ల వినియోగదారులకు ఉచిత విద్యుత్, పింఛన్ల పెంపు వంటి పథకాలు అమలుకు నోచుకుంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచు చిలుముల మంజుల, రమేశ్, దుబ్బాసి బుచ్చయ్య, నాయకులు పుల్కం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఆరు గ్యారంటీలు

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్: ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని రేణికుంటలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన సభను ప్రారంభించి మాట్లాడారు. అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అందిస్తామని తెలిపారు. అందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు అధికారులు సహకరించాలని ఆదేశించారు. రేషన్ కార్డు లేనివారు కూడా దరఖాస్తు చేసుకోవడంతోపాటు కార్డు కావాలని కూడా అర్జీ పెట్టుకోవాలని తెలిపారు. ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ కనుకయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, వైస్ ఎంపీపీ వీరారెడ్డి, సర్పంచ్, ఉప సర్పంచ్, అధికారులు, సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

మానకొండూర్‌రూరల్: మండలంలోని శంశాబాద్, శ్రీనివాస్‌నగర్, పోచంపల్లి, రంగపేట గ్రామాల్లో శుక్రవారం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. పలుగ్రామాల నుంచి 1,461 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీవో రాజేశ్వర్ రావు తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

చిగురుమామిడి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నర్సయ్య కోరారు. శుక్రవారం మండలంలోని చిన్నముల్కనూర్, పీచుపల్లి గ్రామాల్లో వికసిత భారత్ సంకల్పయాత్రలో భాగంగా అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. మెడికల్, వ్యవసాయం, అంగన్‌వాడీ తదితర పథకాలకు సంబంధించిన అధికారులు ఆయా శాఖల ప్రాధాన్యతపై మాట్లాడారు. రెండు గ్రామాల సర్పంచ్‌లు వెంకటనర్సింహారెడ్డి, లీలా, మెడికల్ ఆఫీసర్ విప్లవశ్రీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజశ్రీ, ఐకేపీ సీసీ గంట సంపత్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

మండలంలో 13,091 దరఖాస్తులు

సైదాపూర్: మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో 13,091 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ మంజుల, ఎంపీడీవో పద్మావతి తెలిపారు. 28 నుంచి ఈనెల 5తో మండలంలో అన్ని గ్రామాల్లో సభలు ముగిశాయి. 13,028 కుటుంబాలున్నప్పటికీ 26 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన సభల్లో 13,091 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసేవారు గ్రామపంచాయతీల్లో కార్యదర్శికి సమర్పించాలని సూచించారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు



చొప్పదండి: శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



గన్నేరువరం మండలం సాంబయ్యపల్లిలో...



రామడుగు: అక్షితల పంపిణీలో శ్రీరామ భక్తులు

రామడుగు: గోపాల్‌రావుపేటలో అయోధ్య శ్రీరాముడి అక్షింతల పంపిణీ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి భజనలు చేస్తూ ఇంటింటా పంపిణీ చేశారు.

భూపాలపట్నంలో శోభాయాత్ర

చొప్పదండి: మండలంలోని భూపాలపట్నంలో అయోధ్య రామయ్య అక్షింతలు, ఆహ్వాన పత్రాలతో గ్రామంలో భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ మునిగాల విజయలక్ష్మి, బైరగోని కిట్టుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలంలోని సాంబయ్యపల్లిలో రాముల వారి అక్షింతలను భక్తులు ఇంటింటా పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నేడు ఆరట్టు ఉత్సవం

చొప్పదండి: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర మణికంఠ ఆలయం వార్షికోత్సవానికి ముస్తాబైంది. నేటి నుంచి రెండు రోజుల పాటు ఆలయంలో వార్షికోత్సవాలు, ప్రత్యేక పూజలు చేయనున్నారు. తిరుపతికి చెందిన చంద్రమౌళి వెంకటేశ్వర శర్మ చేతుల మీదుగా పూజలు నిర్వహించన్నారు. శనివారం ఉదయం గణపతి పూజ, కోటి లింగాల క్షేత్రంలోని గోదావరి నదిలో ఆరట్టు ఉత్సవం, సాయంత్రం చొప్పదండి పట్టణంలో స్వామి వారి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 7న గణపతి హోమం, మూల విరాట్‌కు అభిషేకం, రాత్రి సామూహిక మహాపడి పూజ, భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలు విజయవంతం చేయాలని కోరారు.

మున్సిపల్ సర్వసభ్య సమావేశం వాయిదా



మున్సిపల్ ఎదుట పోలీసుల బందోబస్తు

జమ్మికుంట: మున్సిపల్ సర్వసభ్య సమావేశం వాయిదాతో కార్యాలయం వద్ద ఉత్కంఠ నెలకొంది. చైర్మన్ రాజేశ్వర్‌రావు సమావేశానికి శుక్రవారం పిలుపు ఇవ్వడంతో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. రాజేశ్వర్‌రావు వర్గం కౌన్సిలర్ సమావేశానికి వస్తున్నారనే సమాచారంతో అభిమానులు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. సీపీ ఆదేశాల మేరకు హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి, పట్టణ సీఐ బార్పటి రమేశ్ ఆధ్వర్యంలో జమ్మికుంట, ఇల్లందకుంట ఎస్‌ఐలు మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని కేంద్ర బాలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. లోనికి ఎవరిని అనుమతించలేదు. ఉదయం 10 గంటలకు కౌన్సిల్ సమావేశం జరగాలి కానీ మధ్యాహ్నం రెండు గంటల వరకు ఏమీ జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అనంతరం కౌన్సిల్ సమావేశం వాయిదా పడినట్లు కమిషనర్ బి. శ్రీనివాస్ తెలపడంతో ఉత్కంఠకు తెరపడింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యేగా పాడి కౌశిక్‌రెడ్డి విజయం సాధించారు. మున్సిపల్ కౌన్సిల్‌లో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా నమోదు కావాల్సి ఉంది. మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం, తదనంతరం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఎక్స్‌అఫీషియో సభ్యుడి ఓటు కీలకం కానుంది. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఎక్స్‌అఫీషియో సభ్యుడి కోసం కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నప్పటికీ సభ్యుడిగా నమోదు ఆలస్యమైంది. దీంతో చైర్మన్ రాజేశ్వర్‌రావు పాలకవర్గం అప్రమత్తమై సర్వసభ్య సమావేశం నిర్వహించి, ఎక్స్ అఫీషియో సభ్యుడి ఎమ్మెల్యేగా ఆమోదం తెలిపి ప్రమాణ స్వీకారం చేయించేందుకు చైర్మన్ వర్గం క్యాంపు నుంచి జమ్మికుంటకు బయలుదేరింది. కానీ కలెక్టర్ ఎక్స్ అఫీషియో సభ్యుడి ఆమోదం తెలిపిందని సమాచారంతో కౌన్సిల్ సమావేశం వాయిదా పడడంతో ఉత్కంఠకు తెరపడింది. కాగా కలెక్టర్ ఈ నెల 25న అవిశాసంపై కౌన్సిల్ సభ్యులతో సమావేశం నిర్ణయించనున్నట్లు కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేశారు.

రుణమాఫీ, రైతుబంధు అమలు చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి

మానకొండూర్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుబంధు మంజూరు చేస్తామని, ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేయడంలో విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలరోజులు గడుస్తున్నా హామీలను ఎందుకు నెరవేర్చడంలేదని మండిపడ్డారు. ఆరు గ్యారంటీ పథకాలు, మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. నిరుపేదలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన గృహలక్ష్మి పథకాన్ని రద్దుచేయడం సమంజసంకాదన్నారు. దళితబంధు, బీసి బంధు లబ్ధిదారులకు నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే సత్యనారాయణ దిగజారుడు మాటలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శేఖర్, సీనియర్ నాయకులు దేవేందర్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, వెంకన్న, పృథ్వీరాజ్, యాదగిరి, శ్రీనివాస్‌గౌడ్, డి. శేఖర్, అనిల్, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు యువకుల వినతి

రామడుగు: గోపాల్‌రావుపేట గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు గ్రామ యువకులు వినతిపత్రం అందజేశారు. గతంలో పలుమార్లు మండల కేంద్రం కోసం ఆందోళనలు, పాటు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని, మండల కేంద్రంకు అన్ని సౌకర్యాలు ఉన్నాయని వినతిపత్రంలో వివరించారు. కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత విష్ణు, యువకులు కొలిపాక కమలాకర్, ఆరె వినోద కొలిపాక నాగరాజు, కొల్లూరి అనిల్ పలువురు పాల్గొన్నారు.

‘క్యాంపు రాజకీయాలతో పరువు తీస్తున్నారు’



మాట్లాడుతున్న నాయకులు

జమ్మికుంట: మున్సిపల్ కౌన్సిలర్లు ప్రజా సేవను గాలికొదిలి, అవిశ్వాసం పేరుతో క్యాంపు రాజకీయాలతో సంపాదనే ధ్యేయంగా పని చేస్తూ జమ్మికుంట పట్టణ పరువు తీస్తున్నారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేశ్, మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలో మాట్లాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా సమస్యలు పరిష్కరించాల్సిన కౌన్సిలర్లు గ్రూపు రాజకీయాల చేస్తున్నారని, ప్రజలకు అందుబాటు లేని కౌన్సిలర్లను పదవి నుండి తొలిగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో పట్టణ ప్రజలు బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, కోరే రవీందర్, పల్లపు రవి, దొంతుల రాజకుమార్, మోతె స్వామి, ఇటుకాల స్వరూప, కోలకాని రాజు, కైలాసకోటి గణేష్, రాజేష్, మోడెం రాజు, కొండ్లే నగేష్, గర్రెపెల్లి నిరూపరాణి, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

జమ్మికుంట: యాసంగి సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తుందని అన్నదాతలకు రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో కామ్రేడ్ కొప్పుల శంకర్ అధ్యక్షతన సీపీఎం జోన్ కమిటీ సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో అనేక సమస్యలు పేరుకపోయినప్పటికీ పరిష్కరించకుండా కౌన్సిలర్లు క్యాంప్ రాజకీయాలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచి పరిణామం కాదన్నారు. ప్రజల కోసం ఆలోచించకుండా వ్యక్తిగత స్వార్థం కోసం పని చేసే ప్రజా ప్రతినిధులను ప్రజలు తరిమికొట్టాలని పిలుపు నిచ్చారు. మతోన్మాదం ఎజెండాతో ప్రజలను చీల్చుతూ బీజేపీ పబ్బం గడుపుకుంటుందన్నారు. బీజేపీని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో సీపీఎం జోన్ కార్యదర్శి శీలం అశోక్, బాసిర సంపత్‌రావు, చెల్పూర్ రాములు, దండిగారి సతీష్, పాల్గొన్నారు.

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనలు కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నివాళి, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com